ఆంధ్రా ప్యారిస్‌లో చవితి సందడి

తెనాలి: ఆంధ్రాప్యారిస్ తెనాలిలో వినాయక చవితి సందడి నెలకొంది. భారీ వర్షాల కారణంగా పంటలు నీటమునిగి రైతాంగం ఆందోళనలో ఉండటం, పండగ ముందురోజైన శుక్రవారం మధ్యాహ్నం నుంచి పలుమార్లు వర్షం కురవటంతో ఏటా ఉన్నంత సందడి కనిపించలేదు. ఆ వర్షంలోనే మార్కెట్‌సెంటర్, తెనాలి-విజయవాడ రోడ్డు, బోసురోడ్డు, శివాజీచౌక్, బుర్రిపాలెంరోడ్డు, గంగానమ్మపేట ప్రాంతాల్లో రంగురంగుల వినాయక ప్రతిమలు, పత్రి అమ్మకాలకు తాత్కాలిక స్టాల్స్ వెలిశాయి. పిల్లలకు ఆటవస్తువుల అమ్మకాలు సరేసరి! ఆయాచోట్ల వ్యాపారాలు మందకొడిగా సాగుతున్నాయి. పండుగరోజు ఉదయం తెరిపిస్తే వ్యాపారం ముమ్మరం కాగలదని ఆశిస్తున్నారు. ఇకపోతే ఎప్పట్లాగే 'గణపతి బొప్పా మోరియా' అంటూ వినాయక చవితి ఉత్సవాలకు ఎక్కడికక్కడ వీధుల్లో పందిళ్లు ఏర్పాటయ్యాయి. వీటిలో ఒకరిని మించి ఒకరు భారీ గణనాథుని విగ్రహాలను ఉంచారు. వీధుల్లో రాకపోకలకు అవరోధంగా వినాయక విగ్రహాలు వద్దని అధికారులు ఎంతగా చెప్పినా, చిన్నచిన్న వీధుల్లో భారీ పందిళ్లు వేసి, పండగ సన్నాహాల్లో ఉన్నారు. ఇకపోతే వివిధ స్వచ్ఛంద సేవాసంస్థలు మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశాయి. ఊరి వెలుపల గల 59.5 అడుగుల భారీ గణపతి విగ్రహానికి రంగులు ముస్తాబయ్యాయి.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

బ్రాహ్మణ పరిషత్, తెనాలి ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తపేటలోని సంస్థ కార్యాలయంలో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. స్థానిక మారిస్ పేట శివాలయం, గంగానమ్మపేటలోని పాత శివాలయం, రామలింగేశ్వరపేట శివాలయం వద్ద కూడా మట్టి వినాయక ప్రతిమలను కోరినవారికి అందజేశారు. వినాయక చవితి పర్వదినాన్ని పర్యావరణ హితంగా జరుపుకోవాలనే భావనతో పరిషత్ ఆధ్వర్యంలో గత 15 ఏళ్లుగా ఈ సేవను కొనసాగిస్తున్న అధ్యక్షుడు కోటా పార్థసారథి చెప్పారు. కార్యదర్శి, చింతపల్లి సాయికిరణ్, ఉపాధ్యక్షుడు కాజా శ్రీనివాసరావు, లక్ష్మణ కుమార్, సహాయ కార్యదర్శి మన్నవ మురళీధర్, కోశాధికారి రాంబాబు, సభ్యులు కొండపి శ్రీనివాసరావు, కొణిదేన సరళ, ఫణి శర్మ పిడుగు శ్రీనివాస్, కుందుర్తి విశ్వేశ్వరరావు, పోతుకుచ్చి ధనుంజయ, శిఖరం శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.



సందడిగా కనిపిస్తున్న మార్కెట్ సెంటర్ ప్రాంతం



అమ్మకాలకు సిద్ధమైన పత్రి



పూజకు సిద్ధమైన భారీ గణపతి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో....

వినాయక చవితి సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక శివాజీచౌక్‌లో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు కార్యదర్శి దేవయ్యజనం మురళీకృష్ణ, ఈదర వెంకట పూర్ణ చంద్, నల్లూరి వెంకటేశ్వరరావు, పావులూరు రాంబాబు, కాకుమాను ఉపేంద్ర, కుర్రా శ్రీనివాసరావు ఆలపాటి కిరణ్ చౌదరి, చేతన్ రాజ్ కొఠారి, కన్నెగంటి మురళి, మహేష్, శ్రీహరి పాల్గొన్నారు.

కొల్లిపరలో...

వినాయకచవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా కొల్లిపరలోని శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. కొల్లిపరలోని శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘానికి చెందిన శ్రేష్ఠ స్మార్ట్ స్టోర్ వద్ద జరిగిన కార్యక్రమంలో కంపెనీ ఛైర్మన్ నెర్ల కుటుంబరెడ్డి, డైరెక్టర్లు దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నెర్ల జ్యోతి చేతులమీదుగా 400 విగ్రహాలను సభ్యులకు, గ్రామస్తులకు పంపిణీ చేసినట్టు తెలిపారు.

గణపతి మట్టి విగ్రహాల పంపిణీ

మున్నంగి(కొల్లిపర): వినాయక చవితిని పురస్కరించుకుని మండలంలోని మున్నంగి గ్రామంలోని మండల ప్రాథమికపాఠశాల(ఆర్)లో ఉపాధ్యాయులు రాము, సోమరౌతు లక్ష్మీకమల విద్యార్థులకు మట్టి విగ్రహాలు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కనిపైనా ఉందన్నారు.కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ సంజి దాసుల్తానా, భార్గవి, ఓలేటి లక్ష్మి , విద్యార్థులు పాల్గొన్నారు.



చవితి గొడుగులు అమ్మకం



వినాయక ప్రతిమలు

మట్టి వినాయకుడిని పూజించండి

తెనాలిఅర్బన్: మట్టి వినాయక ప్రతిమను పూజించి పర్యావరణాన్ని అందరూ పరిరక్షించాలని ఎస్‌సీఆర్ ఎస్ఎంహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.వి.సుధారాణి కోరారు. మట్టి వినాయకుని ప్రతిమను పూజించాలని కోరుతూ ఎస్‌సీఆర్ స్కూల్‌లోని స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కువ మంది ప్లాస్టా ఆఫ్ ప్యారిస్ రంగులు వేసి విగ్రహాలను పూజిస్తుంటారని తెలిపారు. దీనివలన పర్యావరణానికి హానీకలిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే వినాయక చవితి పండుగను పురస్కరించుకుని డబుల్ హార్స్ మినపగుళ్లు సంస్థ సహకారంతో మున్సిపల్ ఉద్యోగులకు శుక్రవారం సాయంత్రం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న, పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రోటరీ క్లబ్‌చే మట్టి వినాయకుడి పంపిణీ



కొల్లిపరలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



కొల్లిపరలో గణపతి మట్టి విగ్రహాలను విద్యార్థులకు అందజేసిన ఉపాధ్యాయులు



ర్యాలీలో పాల్గొన్న స్కౌట్ విద్యార్థులు



వినాయక ప్రతిమల పంపిణీ చేస్తున్న సభ్యులు



ఉద్యోగులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక

క్లుప్తంగా

10లోగా ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

తెనాలి: అధిక వర్షాలు, వరదల కారణంగా జరిగిన పంట నష్టానికి రైతులు ఇన్‌పుట్ సబ్సిడీ (పెట్టుబడి రాయితీ)ని పొందటానికి, వరి, మినుము, అరటి పంటలకు బీమా పరిహారానికి ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా తెనాలి ఏడీఏ ఉషారాణి శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. పంట నమోదుకు, పంట నష్టం నమోదుకూ ఈనెల 10వ తేదీ చివరి గడువుగా తెలిపారు. రైతుసోదరులంతా రైతు సేవాకేంద్రం సిబ్బందిని సంప్రదించి ఒకటి రెండురోజుల్లో పంట నమోదు చేసుకోవాలని సూచించారు.

ఈ పంట నమోదు తప్పనిసరి

కొల్లిపర: అధిక వర్షాలు, వరదలు కారణంగా ప్రభుత్వం అందించే పెట్టుబడి రాయితీకి అర్హత పొందాలి అంటే సాగు చేస్తున్న రైతు తప్పని సరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని ఏవో కె.వెంకటరావు అన్నారు.శుక్రవారం ఆయన లంక గ్రామంలో రైతులతో మాట్లాడుతూ 2024 లో ఈ పంట నమోదు కార్యక్రమం శనివారం(నేటి)తో చివరి రోజు కావున ఇప్పటి వరకు చేయించని రైతులు రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని, వ్యవసాయాధికారులను సంప్రదించి నమోదు పూర్తి చేసుకోవాలని కోరారు. నేడు వినాయ చవితి పండుగ అయిన ఈ పంట నమోదు కార్యక్రమం చివరి రోజు కావున ప్రతి గ్రామంలో రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ సిబ్బంది అందుబాటులో ఉంటారని, నమోదు కాని రైతులు వచ్చి నమోదు చేసుకోవాలని సూచించారు.

వరద బాధితులకు వితరణ



తెనాలిఅర్బన్: వరద వల్ల సర్వం కోల్పోయిన విజయవాడ వాసులకు పంపిణీ చేసేందుకు అవసరమైన 20 బస్తాల బియ్యాన్ని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులకు శుక్రవారం చైతన్య విద్యాసంస్థల నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ విద్యాసంస్థల ఆధ్వర్యంలో బియ్యాన్ని బాధితులకు పంపిణీ చేసేందుకు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ అప్పాజీ, ప్రధానోపాధ్యాయులు బి.రాధ, బి.మాధురి, జి.లక్ష్మీపతిరావు, ఎ.పద్మవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోషక విలువలున్న ఆహారాన్నే తీసుకోవాలి



తెనాలిఅర్బన్: పోషక విలువలున్న ఆహారాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ పేర్కొన్నారు. జాతీయ పోషకాహార వారోత్సవాల్లో భాగంగా బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ స్కూల్‌లో ఆహార పదార్థాల ప్రదర్శనను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శనలో ఉంచడం జరిగిందన్నారు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, చిరు ధాన్యాలు వంటి వాటిని ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం



తెనాలిరూరల్: వరదలు, వర్షాల కారణంగా నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ చెప్పారు. ఆయన ఆధ్వర్యంలో ప్రభుత్వం తరపున బియ్యం, నిత్యావసరాలను రూరల్ గ్రామాలు కొలకలూరు, అంగలకుదురు, కోపల్లె, బుర్రిపాలెం గ్రామాలలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ముంపు గ్రామాల్లో బాధితులకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి భోజన వసతి సౌకర్యాలు కల్పించామన్నారు. గ్రామాల్లో వరదలు, వర్షాలు కారణంగా ప్రజలకు ఏదైనా నష్టం జరిగితే తక్షణమే నివేదిక పంపాలని వీఆర్వోలను ఆదేశించారు. అంగలకుదురు, కోపల్లె గ్రామాల్లో బాధితులకు వంట పాత్రలను గణేష్ యూత్ బృందం అందజేసింది. అలాగే కొలకలూరు బాధితులకు రూ.2వేల చొప్పున నగదును అందించారు. కొలకలూరు సర్పంచ్ డాక్టర్ చొప్పర ప్రీతి, అంగలకుదురు ఉపసర్పంచ్ కనగాల నాగ భూషణం, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, నాయకులు మురళీధర్, రవి, కృష్ణమోహన్, వీఆర్‌వోలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ దుకాణంలో చోరీ

తాడికొండ: తాడికొండ అడ్డరోడ్డులోని విజయ గణపతి ఎలక్ట్రికల్ దుకాణంలో శుక్రవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. రాత్రి సమయంలో తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడిన దొంగలు రూ. 2 లక్షలు విలువ చేసే సామగ్రి దొంగిలించినట్లు నిర్వాహకులు ఫిర్యాదు చేశారు. దుకాణ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు.

ముంపు గ్రామాల్లో కలెక్టర్ పర్యటన

- సమస్యలు విన్నవించిన గ్రామస్తులు
- పరిష్కరించాలంటూ అధికారులకు ఆదేశాలు

కొల్లిపర: ముంపునకు గురైన పాతబొమ్మువానిపాలెం, అన్నవరపులంక , కొత్తూరులంక గ్రామాల్లోని వరద బాధితులను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి పరామర్శించారు. తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజన సింహా, మండల స్థాయి అధికారులతో కలసి ఆయా గ్రామాల్లో పర్యటించారు. వరదల కారణంగా ప్రభుత్వ అందిస్తున్న సహాయ సహకారాలు సరిగ్గా అందుతున్నదీ లేనిదీ బాధితులను అడిగి తెలుసుకున్నారు. వరదలకు పశువుల పాకలు, పూరిళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని లంక గ్రామాల ప్రజలు చెప్పారు. ఎండుగడ్డి వర్షాలకు తడిచినందున, పశువులు తినడం లేదని చెబుతూ, పశువులకు ఇచ్చే దాణా మరింత అందించాలని కోరారు. పశువులకు రోగాలు వస్తున్నందున, వాటికి గ్రామంలోనే వైద్యం అందించే ఏర్పాటు చేయాలన్నారు. పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ వరదలు కారణంగా నష్టం జరిగిన ప్రతి ఒక్కరికీ అన్ని విధాల ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు. గ్రామంలో నష్టం జరిగిన ఇళ్లు, పశువుల పాక వంటివి ప్రతీది, అధికారులు రికార్డులో నమోదు చేసి వాటిని తమకు అందిస్తారని వాటిని పరిశీలించి వీలైనంత త్వరగా బాధితులకు సహకారం అందించేలా చూస్తామన్నారు. పశువులకు ప్రభుత్వం అందిస్తున్న దాణా అవసరమైన వారికి పూర్తిస్థాయిలో అందించాలని పశువైద్యాధికారి సాయి సతీష్‌రాజును ఆదేశించారు. వరదల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతు, కౌలు రైతులకు వెంటనే ఈ క్రాప్ బుకింగ్ చేయాలని, ఎటువంటి పట్టాలు లేకుండా లంక సొసైటీ భూములలో పంటలు సాగుచేస్తున్నారో? వారి జాబితా కూడా వెంటనే తయారు చేయాలని మండల వ్యవసాయ అధికారి కె.వెంకటరావును ఆదేశించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దారు సిద్ధార్థ తో మాట్లాడుతూ లంక గ్రామంలో ప్రజలకు ఎటువంటి రోగాలు రాకుండా 24 గంటలు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం అన్నవరపులంకలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తో కలసి బాధితులకు రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వారు అందించిన నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. డిప్యూటీ సీఈవో జె.మోహనరావు, ఎంపీడీవో వి.విజయలక్ష్మి, తహసీల్దారు సిద్ధార్థ, ఏవో వెంకటరావు, మండల పరిషత్ ఏవో చంద్రమోహన్, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.




పాత బొమ్మువానిపాలెంలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

పాలు, గుడ్లు, ఆకుకూరలతో రక్తహీనత దూరం

తెనాలిఅర్బన్: రక్తహీనతను నియంత్రించేందుకు పాలు, గుడ్లు, ఆకుకూరలు దోహదపడతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సౌజన్య పేర్కొన్నారు. విలేజ్ హెల్త్ నేషనల్ డేను పురస్కరించుకుని 35వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని అందరూ సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎం.ఉషారాణి, ప్రవల్లిక, ఏఎన్ఎం సి.హెచ్.చంద్రమ్మ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

+ పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా మారీసుపేట మఠంబజార్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రతలను ఏఎన్ఎం వి.విజయలక్ష్మి తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, వెంకటలక్ష్మి, అనూష; మహిళ పోలీసు ఎస్.సౌమ్య, పాల్గొన్నారు.



మారీసుపేట అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ఏఎన్ఎం విజయలక్ష్మి

మద్యం దుకాణ ఉద్యోగుల ప్రదర్శన

తెనాలి: ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. తెనాలి డిపో పరిధిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్ ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. స్థానిక రణరంగచౌక్ నుంచి ఆరంభమైన ప్రదర్శన మార్కెట్ సెంటర్, మున్సిపల్ కార్యాలయం, గంగానమ్మపేట వంతెన, సాయిబాబు గుడి, రైల్వేస్టేషన్ సెంటర్ వరకు కొనసాగింది. అక్కడ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించారు. గత అయిదేళ్లుగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సూపర్‌వైజర్లు, సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నామని, కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, మద్యం దుకాణాలను ప్రైవేటుపరం చేస్తున్నట్టు తెలియవచ్చిందని పినపోటి కొండలరాజు, ధనరాజుపల్లి సురేష్ చెప్పారు. అదే జరిగితే తమకు ఉద్యోగ భద్రత ఉండదని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామని, అలాగే తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తాము ఎవరికీ వ్యతిరేకం కాదనీ, సేవకులు మాత్రమేనని స్పష్టంచేశారు. ఇతర ప్రభుత్వ విభాగాల్లోనైనా ఔట్‌సోర్సింగ్‌లో ఉద్యోగాలను కల్పించాలని కోరారు. ప్రభుత్వం తమ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని పినపాటి వంశీకృష్ణ, కొల్లూరు భాస్కర్, కంచర్ల శివప్రసాద్, పఠాన్ లతీఫ్ కోరారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



తెనాలిరూరల్: మండలంలోని నందివెలుగు గ్రామానికి చెందిన కూచిపూడి ప్రసూన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలోని పేదలకు దుప్పట్లు అందజేసి ఆహారాన్ని పంపిణీ చేశారు. రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దుప్పట్లను కనపాల ఆనంద్‌బాబు, కూచిపూడి ప్రవీణ్, ప్రసూన సమకూర్చారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు కూచిపూడి జాన్‌బాబు పర్యవేక్షించారు.

దోమల నియంత్రణకు సహకరించండి

తెనాలిఅర్బన్: దోమల నియంత్రణకు అనేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న సూచించారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో 10వ వార్డులోని పలు వీధుల్లో శుక్రవారం మురుగు కాల్వలు, నీటి నిల్వలు ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేసి, ఫాగింగ్ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రామచంద్రరావు, బాజీ, శానిటరీ సెక్రటరీ లక్ష్మీ, మలేరియ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్య పర్యవేక్షకులు దీపాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమ్మా.. ఇలా చేసేవేంటమ్మా!



అన్నవరపు లంక (కొల్లిపర): కృష్ణా నది వరదలు కారణంగా మండలంలోని అన్నవరపు లంక గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతో విద్యార్థుల పుస్తకాలు, పాఠశాల రికార్డులు పూర్తిగా నీట మునిగాయి దీంతో వరద తగ్గటంతో శుక్రవారం ఉపాధ్యాయులు వరద నీటిలో నానిన విద్యార్థుల పుస్తకాలు, రికార్డులు పాఠశాల ఆరుబయట ఆరబెడుతున్నారు. పాఠశాలలో చదివిన ప్రతి విద్యార్థి కి చెందిన వివరాలు ఉన్న రికార్డులు చాలా భద్రంగా ఉంచాల్సిన ఉపాధ్యాయులు ఇంత నిర్లక్ష్యంగా ఉంటం ఏమిటి అని పలువురు వాపోతున్నారు. గ్రామస్తులు మాత్రం మా పిల్లలకు చదువు కోవటానికి పుస్తకాలు ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

ద్రవ జీవామృతంపై అవగాహన

తాడేపల్లిరూరల్: వరద ముంపునకు గురైన పంటలను ఎలా కాపాడుకోవాలనే అంశంపై శుక్రవారం ఉండవల్లికి చెందిన తమ్మా దుర్గా ప్రసన్న రైతులకు వివరించారు. వరి పొలాల్లో నీటిని తొలగించిన అనంతరం ద్రవ జీవామృతం పిచికారీ చేయడం వల్ల జరిగే లాభాల గురించి చెప్పారు. ద్రవ జీవామృతం ఎలా తయారు చేసుకోవాలో చూపించారు.

బాధితులకు అండగా ఉంటాం

కేంద్ర మంత్రి పెమ్మసాని

తెనాలిరూరల్: ప్రభుత్వం తరపున ప్రతి బాధితుడికి సాయం అందేలా చూస్తామని కేంద్ర కమ్యునికేషన్స్ సమాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. రూరల్ మండలం బుర్రిపాలెం గ్రామంలో వరద బాధితులకు గ్రామ జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలసి శుక్రవారం ఆయన పరిశీలించారు. వరద బాధితులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బియ్యం ఇతర సరుకులను అందజేస్తోందని, ప్రతి ఒక్కరికి సాయం అందుతుందని చెప్పారు. అనంతరం గ్రామంలో ముంపుకు గురైన ఎస్టీ కాలనీలోని ఇళ్లను పరిశీలించారు. అలానే గుంటూరు మార్గమధ్యంలో కొలకలూరు, హాఫ్‌పేట వద్ద పొలాలను పరిశలీఇంచి రైతులతో మాట్లాడారు.



బాధితులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మాజీ మంత్రి ఆలపాటి

పంటపొలాలు పరిశీలించిన జెడ్పీ చైర్‌పర్సన్

తెనాలి: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా శుక్రవారం తెనాలి మండలంలోని కొలకలూరు, హాఫ్‌పేట, ఖాజీపేట గ్రామాల్లోని నీట మునిగిన పంటపొలాలను పరిశీలించారు. నడుములోతు నీళ్లతో పంట పొలాలు చెరువులను తలపిస్తుండటాన్ని గమనించారు. చేల గట్లు మినహా పంట ఎక్కడా కనిపించలేదు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి పంట వేసుకుంటే అకాల వర్షంతో పొలాలన్నీ నీటి మునిగి చెరువుల్లా మారిపోయాయని రైతులు ఆవేదన వెలిబుచ్చారు పంట పనికిరాదని చెప్పారు. పంట పొలాలను చూస్తుంటే చాలా ఆవేదనంగా ఉందని హెని క్రిస్టినా అన్నారు. అకాల వర్షాలతో తమ కాలనీ అంతా నీట మునిగిందని హాఫ్‌పేట గ్రామస్తులు చెప్పారు. ఇళ్లలోని గృహోపకరణాలు కూడా పాడైనట్టు చెప్పారు. రైతుల కష్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మంత్రులు నారా లోకేష్, నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకువెళ్లి సాయం అందేలా చూస్తానని చెప్పారు. చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు పంటపొలాలను చూస్తే తాను కలత చెందానని చెప్పారు.



పంటపొలాలను పరిశీలిస్తున్న హెనీ క్రిస్టినా

తెనాలిలో వర్షం

తెనాలిఅర్బన్: అల్పపీడం ప్రభావం కారణంగా తెనాలి పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వచ్చినప్పటికీ మధ్యాహ్నం ఒకసారిగా వాతావరణం చల్లబడింది. చిరు గాలులతో కూడిన వర్షం అరగంట పాటు కురిసింది. దీంతో కొన్ని రోడ్లు స్వల్పంగా జలమయంమయ్యాయి.